క్లుప్తంగా

16న జాతీయ లోక్ అదాలత్



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటగిరి జూనియర్ సివిల్‌జడ్జి అనూష

వెంకటగిరిరూరల్: కక్షిదారులకు రాజీ కుదిర్చేందుకు మార్చి 16వ తేదీన జాతీయ లోక్‌అదాలత్‌ను నిర్వహించనున్నట్లు వెంకటగిరి జూనియర్ సివిల్‌జడ్జి అనూష తెలిపారు. వెంకటగిరి కోర్టులో సోమవారం వెంకటగిరి సర్కిల్ పరిధిలోని సీఐ, ఎస్‌ఐలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ పోలీస్ స్టేషన్లలో పెండింగ్‌లో ఉన్న కేసులకు సంబంధించిన కక్షిదారులకు మార్చి 16వ తేదీన జరిగే అదాలత్‌లో కేసులు పరిష్కరించుకునే అవకాశం ఉందన్నారు. వివాదాలను రాజీ కుదుర్చుకుని, కేసులను మాఫీ చేసుకోవచ్చని తెలిపారు. ఈ మేరకు పోలీసులు కక్షదారులకు అవగాహన కల్పించాలని సూచించారు.

బహుమతుల పంపిణీ

గూడూరురూరల్: పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాలలో జరిగిన వైఎస్సార్ క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ సోమవారం రాత్రి బహుమతులు అందజేశారు. విజేత జట్టుకు ట్రోఫీతోపాటు రూ.15 వేల ప్రైజ్ మనీని అందజేశారు. అలాగే రన్నర్‌గా నిలిచిన జట్టుకు ట్రోఫీ, రూ.10 వేల నగదు బహుమతి ప్రదానం చేశారు. బెస్ట్ బ్యాట్‌మెన్స్, బెస్ట్ బౌలర్లుగా ఎంపికైన సాయి, పోలయ్యకు రూ.1016 ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గురవయ్య, కే సునీల్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, వీ నాగరాజు, విద్యాసాగర్, ప్రభు, మురళీ, అశోక్ వెంకటేశ్వర్లు, ప్రణేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సత్వర పరిష్కారం

గూడూరురూరల్: స్పందనలో వచ్చే ప్రతి అర్జీ ఆన్‌లైన్ చేసి, త్వరితగతిన సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఆర్డీఓ కిరణ్ కుమార్ తెలిపారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో ప్రజలు పలు సమస్యలపై అర్జీలు అందజేశారు. నాంచారమ్మపేటకు చెందిన చల్లా యానాది వర్గానికి చెందిన నలుగురు కుటుంబ సభ్యులు ఆధార్ కార్డులు లేవని, దీంతో తమకు ఎలాంటి సంక్షేమ పథకాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన ఆయన వారిని పక్కనే ఉన్న ఆధార్ కేంద్రానికి పంపి ఆధార్ నమోదు చేయించాలని అధికారులను ఆయన ఆదేశించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నాయుడుపేటటౌన్: పురుగుల మందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి సోమవారం రాత్రి మరణించాడు. పోలీసుల కథనం మేరకు.. పెళ్లకూరు మండలం ఎగువచావాలి గ్రామానికి చెందిన పల్లం రమేష్(42) ఆదివారం రాత్రి పురుగుల మందు తాగి పట్టణంలోని శ్రీరామ్ నగర్ వద్ద అపస్మారకస్థితిలో పడిపోయాడు. స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించగా వారు స్థానిక ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి భార్య స్వప్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గుర్తుతెలియని వృద్ధుడి మృతి



సైదాపురం (వెంకటగిరి): ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ గుర్తు తెలియని వృద్ధుడు(73) సోమవారం మృతి చెందాడు. గూడూరు రైల్వే పోలీసుల కథనం మేరకు.. వెంకటగిరి రైల్వేస్టేషన్‌లో ఓ గుర్తు తెలియని యాచకుడు రైల్వేప్లాట్‌ఫామ్‌పై అపస్మారక స్థితిలో ఉండగా పోలీసులు గుర్తించారు. వృద్ధుడిని చికిత్స నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడు వక్క కలర్ జుబ్బా, నలుపు కలర్ స్వెటర్ ధరించి ఉన్నాడని, అతడి వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదని పోలీసులు తెలిపారు. ఈ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు గూడూరు రైల్వే ఎస్‌ఐ కొండప్పనాయుడు తెలిపారు.

మహిళా సాధికారతకు పెద్దపీట



చెక్కు అందజేస్తున్న మేరిగ మురళీధర్



సేవారత్న పురస్కారాలు అందుకున్న వలంటీర్లతో మేరిగ

గూడూరురూరల్: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తున్నారని ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ గూడూరు నియోజకవర్గ సమన్వయకర్త మేరిగ మురళీధర్ అన్నారు. గూడూరులోని సబ్‌కలెక్టర్ ప్రాంగణంలో సోమవారం గూడూరురూరల్ పరిధిలోని 809 సంఘాల్లోని 7,451 మంది సభ్యులకు రూ 5.06 కోట్ల ఆసరా నాలుగో విడత చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాసంకల్పయాత్రలో పొదుపు మహిళలకు ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా వారికి ఆసరా పథకంలో రూ.29వేల కోట్లను పంపిణీ చేశారన్నారు. మహిళలు ఆర్థికంగా బలపడితే ఆ కుటుంబాలు ఎంతో ఉన్నతంగా ఉంటాయనే ఉద్దేశంతో ఆసరా ద్వారా నగదు పంపిణీ చేస్తున్నారని చెప్పారు. అలాగే పలు సంక్షేమ పథకాల ద్వారా వారి జీవన విధానాల్లో పెను మార్పులు తీసుకువస్తున్నారని తెలిపారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్ పర్సన్ పీ దేవసేనమ్మ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర చేసిన సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చారని, అందుకు మరోసారి ఆయన్ని సీఎంగా గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. సీఈసీ సభ్యుడు ఎల్లసిరి గోపాల్ రెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి సంక్షే పథకాలు అమలు కావాలంటే జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా చేసుకోవాలని అన్నారు

వలంటీర్లు సేవాతత్పరులు

వలంటీర్లు సేవాతత్పరులని ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ పేర్కొన్నారు. ఆర్డీఓ కార్యాలయ ఆవరణలో సోమవారం జరిగిన వలంటీర్లకు వందనం కార్యక్రమంలో ఐదుగురు వలంటీర్లకు సేవారత్న పురస్కారాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ వలంటీర్ల వ్యవస్థను దేశంలోని పలు రాష్ట్రాలు అమలు చేసేందుకు ఎదురు చూస్తున్నాయన్నారు. అవినీతి రహిత పాలన వలంటీర్లతోనే మొదలైందని చెప్పారు. అనంతరం వెందోడు, నెర్నూరు, విందూరు, తిప్పవరప్పాడు, నెలటూరు వలంటీర్లు మస్తాన్, కల్పన, లక్ష్మి, కోటేశ్వరరావు, బానతికి సేవారత్న అవార్డులు అందజేశారు.

త్రిలింగేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్టలో మేరిగ

మేకనూరులో నూతనంగా నిర్మించిన త్రిలింగేశ్వర స్వామి దేవస్థానంలో జరిగిన శివలింగస్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో మేరిగ మురళీధర్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ గురవయ్య, మండల కన్వీనర్ ఎం విజయ కుమార్‌రెడ్డి, 24 సొసైటీ అధ్యక్షుడు ఏ శ్రీనివాసులు రెడ్డి, వైస్ ఎంపీపీలు శ్రీనివాసులురెడ్డి, ఇంద్రాణి, పార్టీ పట్టణ అధ్యక్షుడు బీ శ్రీనివాసులు, యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే సునీల్‌రెడ్డి, మేకనూరు సర్పంచ్ జీ విజయ నేతలు సీ విజయ మోహన్‌రెడ్డి, నాగరాజు, కృష్ణయ్య, రమేష్ యాదవ్, సర్పంచ్‌లు బల్లి వెంకటేశ్వర్లు, శీనయ్య, రమణమ్మ, వసంతరెడ్డి, మస్తానయ్య, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకే అండర్ పాస్‌లు



నాయుడుపేటటౌన్: విద్యార్థికి ప్రశంసా పత్రం అందజేస్తున్న ఎంపీపీ ధనలక్ష్మి



దొరవారిసత్రం: మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ గోపాల్‌రెడ్డి

చిల్లకూరు: రైల్వే గేట్లు దాటే సమయంలో పలు ప్రమాదాలు జరుగుతున్నాయని, వాటి నివారించడానికే రైల్వే అండర్ పాస్‌లు ఏర్పాటు చేశారని ఓడూరు సర్పంచ్ ఎస్ శారదమ్మ అన్నారు. మండలంలోని ఓడూరు రైల్వేస్టేషన్ పరిధిలోని మూడు రైల్వే గేట్ల స్థానంలో అండర్‌పాస్‌లను సోమవారం ఢిల్లీ నుంచి ప్రధాన మంత్రి నరేంద్రమోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఓడూరు రైల్వేస్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏడీఎస్‌టీ రంజిత్‌కుమార్, ఉప సర్పంచ్ వీ వెంకటేశ్వర్లు, రైల్వే సిబ్బంది పాల్గొన్నారు.

సబ్‌వే బ్రిడ్జిలు ప్రారంభం

దొరవారిసత్రం: మండలంలోని దొరవారిసత్రం, పోలిరెడ్డిపాళెం, నెలబల్లి, మినమనముడి, నేతాజీనగర్ గ్రామాల సమీపంలో రైల్వే క్రాసింగ్‌ల వద్ద నిర్మించిన సబ్‌వే బ్రిడ్జిలను సోమవారం ప్రధాని నరేంద్రమోదీ ఆన్‌లైన్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా డీవీ సత్రంలో జరిగిన సమావేశంలో వైస్ ఎంపీపీ డీ గోపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం ఏకొల్లు జెడ్పీ, డీవీ సత్రం కేజీబీవీ పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన సాస్కృతిక కార్యక్రమాలు, ఆట పాటలతో అందరినీ అలరించారు. విజేతలకు రైల్వే అధికారులు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈకార్యక్రమంలో ఏడీఆర్ఎం సచిన్‌పునిత్, ఏడీఈఈ చెల్లప్పన్, ఎంఈఓ కృష్ణయ్య, సూపరింటెండెంట్ జోయ్, కమర్షియల్ ఆఫీసర్లు శేషయ్య, ధనుంజయ, జేఈ కౌషిక్, ఎస్‌ఐ తిరుమలరావు, డాక్టర్ చైతన్య, వైఎస్సార్ సీపీ నాయకుడు అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

నాయుడుపేట మండలంలో..

నాయుడుపేటటౌన్: మండలంలోని అయ్యప్పరెడ్డిపాళెం, మర్లపల్లి, తుమ్మూరు, చంద్రబాబు కాలనీ, బిరదవాడ, శ్రీనివాసపురం గ్రామాల సమీపంలోని రైల్వేక్రాసింగ్‌ల వద్ద నూతనంగా నిర్మించిన రైల్వే అండర్ బ్రిడ్జిలను ప్రధాని నరేంద్రమోదీ ఆన్‌లైన్‌లో ప్రారంభించారు. ఈ కార్యక్రమాలను మండలంలోని ఆయా ప్రాంతాల ప్రజా ప్రతినిధుల ఆధ్వర్యంలో జరిపారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ ధనలక్ష్మి, వైఎస్సార్ సీపీ నేత డీ రవీంద్ర, బీజేపీ నాయకులు డాక్టర్ ఆర్ కృష్ణయ్య, చెంచుకృష్ణయ్య, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి వీ కిషోర్ యాదవ్, మున్సిపల్ కమిషనర్ జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రతిపాదనలు సిద్ధం చేయండి



మాట్లాడుతున్న వాకాటి నారాయణరెడ్డి

సూళ్లూరుపేట: స్థానిక రైల్వేస్టేషన్ రెండో వైపున కూడా ఆధునికీకరించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి, పంపితే కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి నిధులు తీసుకొచ్చే బాధ్యతను తీసుకుంటానని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాకాటి నారాయణరెడ్డి అన్నారు. సూళ్లూరుపేట రైల్వేస్టేషన్‌ను ప్రధానమంత్రి నరేంద్రమోదీ వర్చువల్‌గా సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడ జరిగిన సభలో వాకాటి మాట్లాడుతూ సూళ్లూరుపేట పట్టణానికి నడిబొడ్డున రైల్వేస్టేషన్ ఉన్నందున రెండోవైపున కూడా స్టేషన్‌ను ఆధునికీకరించే విషయం కేంద్ర ప్రభుత్వంతో సంప్రదించాలంటే ముందుగా దక్షిణరైల్వే అధికారుల నుంచి ప్రతిపాదనలు వెళ్లాలని, ఆ ప్రతిపాదనలు పంపిస్తే తన వంతు కృషి చేస్తానని చెప్పారు. మున్సిపల్ చైర్మన్ డీ శ్రీమంత్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ దయాకర్‌రెడ్డి, నేతలు ఆది నారాయణరెడ్డి, ఏ విజయభాస్కర్‌రెడ్డి, కే శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాతా,శిశు మరణాలు నివారణకు చర్యలు

పెళ్లకూరు: గర్భిణులు, బాలింతలకు మంచి పౌష్టికాహారంతోపాటు నాణ్యమైన వైద్య సేవలు అందించి మాతా, శిశు మరణాల నివారణకు చర్యలు చేపడుతున్నట్లు ఆ శాఖ జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారి డాక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం పునబాక సచివాలయ పరిధిలోని అన్ని ప్రాంతాల్లోని గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవడంతోపాటు అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారాన్ని సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ రక్తహీనత బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి, పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ సుజాత, నాగేంద్రకుమార్, ప్రకాష్, రూతువినయ్, సుప్రజ, తులసి, సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీకి రూ.16.63 లక్షల ఆదాయం



వేలం పాటలు నిర్వహిస్తున్న కమిషనర్ జనార్దన్‌రెడ్డి

నాయుడుపేటటౌన్: మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన వేలం పాటల ద్వారా నాయుడుపేట మున్సిపాలిటీకి రూ.16.63లక్షల ఆదాయం వచ్చిందని కమిషనర్ జనార్దన్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని మున్సిపల్ కూరగాయల మార్కెట్, అక్కడి దుకాణాలు, రోడ్డు మార్జిన్‌లో కూరగాయలు విక్రయించే వారి వద్ద దినసరి రుసుం వసూలు హక్కులకు నిర్వహించిన వేలం పాటలో రూ.12,57,880కి ఎస్ చంద్రశేఖర్ రెడ్డి దక్కించుకున్నారు. బస్టాండు వద్ద ప్రైవేటు బస్సులు, లారీల వద్ద దినసరి రుసుములు వసూలు హక్కులను జీ కల్యాణి రూ.1.58,120కి దక్కించుకున్నారు. పట్టణంలో తోపుడు బండ్లు, హాకర్ల వద్ద దినసరి రుసుం వసూలు హక్కులను ఎస్ చిట్టిబాబు రూ.2,47,800కు దక్కించుకున్నట్లు కమిషనర్ తెలిపారు.

పంట రుణాల జాబితా విడుదల

సైదాపురం: సున్నావడ్డీ, పంట రుణాల జాబితాలను ఆయా రైతు భరోసా కేంద్రాల్లో ప్రదర్శించినట్లు ఏఓ హైమావతి తెలిపారు. మండలంలోని చాగణం, గులించెర్ల రైతు భరోసా కేంద్రాలను సోమవారం ఆమె తనిఖీ చేశారు. అనంతరం సున్నావడ్డీ, పంట రుణాల రైతుల జాబితాలను కూడా ప్రదర్శించి, రైతులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రబీ, ఖరీఫ్ సీజన్లలో పంట రుణాలు రూ.లక్ష లోపు తీసుకుని సకాలంలో చెల్లించిన రైతుల ఖాతాల్లోకి 4 శాతం వడ్డీ రాయితీ ప్రభుత్వం జమ చేస్తుందన్నారు. మండలంలో 150 మంది రైతులకు రూ.4,39,650 ప్రభుత్వం జమ చేసిందన్నారు.

వంద పని దినాలు పూర్తి చేయాలి



పనులను పరిశీలిస్తున్న ఏపీఓ మృత్యుంజయరావు

దక్కిలి (బాలాయపల్లె): జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరూ వంద పని దినాలు పూర్తి చేసుకోవాలని ఏపీఓ మృత్యుంజయరావు కూలీలకు సూచించారు. బాలాయపల్లె పంచాయతీలో జరుగుతున్న మినీ అమృత్ సరోవర్ పనులను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది మార్చి నెలాఖరులోపు ప్రతి ఒక్కరూ వంద పని దినాలు పూర్తి చేయాలని, లేకుంటే ఆ పనిదినాలు వృథా అవుతాయన్నారు. పనులు జరిగే చోట మార్కింగ్ ఇచ్చి, పనులు చేయించాలని తెలిపారు. ప్రతి కూలీకి కనీస గిట్టుబాటు రూ.272 నగదు అందేలా చూడాలన్నారు. ఎవరైనా పనులకు వెళ్లకుంటే, వారు ఇప్పడైనా పనులకు వెళ్లవచ్చన్నారు. కూలీలు పేర్లు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేసి, సకాలంలో కూలీ నగదు అదేలా చూడాలని తెలిపారు. అనంతరం కూలీల మస్టర్‌ను పరిశీలించారు.

పదిలో ఉత్తమ ఫలితాలే లక్ష్యం

కోట: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించడమే లక్ష్యంగా విద్యార్థులతో ముమ్మర కసరత్తు చేయిస్తున్నట్లు ఎంఈఓ-2 మస్తానయ్య తెలిపారు. మండలంలోని 8 ఉన్నత పాఠశాలలు, 4 గురుకుల పాఠశాలల్లో పదో తరగతి పబ్లిక్ పరీక్షల కోసం విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి, ప్రీపబ్లిక్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మార్చిలో జరగనున్న పది పరీక్షలకు 12 పాఠశాలల నుంచి 604 మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు తెలిపారు. మండలంలో ఆరు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

కండలేరులో 10.323 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో సోమవారం నాటికి 10.323 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకాలువకు 480 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 5, లోలెవల్ కాలువకు 260 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పోలీస్‌స్టేషన్ చేరిన ఇంటర్ ప్రశ్నపత్రాలు



గూడూరులో ప్రశ్నపత్రాలను తరలిస్తున్న సిబ్బంది

కోట: మార్చి ఒకటో తేదీ నుంచి జరగనున్న ఇంటర్మీడియట్ పరీక్షలకు సంబంధించి సెట్-2 ప్రశ్న పత్రాలు సోమవారం కోట పోలీస్‌స్టేషన్‌లో భద్రపరిచినట్లు రూట్ ఆఫీసర్ రాజశాల తెలిపారు. మండలంలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ కళాశాలతో పాటు కోట ఎస్సీ గురుకుల కళాశాలలో పరీక్షల నిర్వహణకు రెండు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

గూడూరురూరల్‌లో..

గూడూరురూరల్: మండలంలో మార్చి ఒకటో తేదీ నుంచి జరగనున్న ఇంటర్ పరీక్షల ప్రశ్నపత్రాలు సోమవారం ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్‌కు చేరాయి. వీటిని అధికారులు లాకర్ గదుల్లో భద్రపరిచారు. రూట్ ఆఫీసర్ రాజనాల మాట్లాడుతూ పట్టణంలో ఐదుపరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని, వీటిలో సెయింట్‌మేరీస్, నారాయణ, ఎస్‌కేఆర్, డీఆర్‌డబ్ల్యూ, స్వరాంధ్ర భారతి కళాశాల ఉన్నాయన్నారు.

మీటర్లు మంజూరు చేయండి



ఆందోళన చేస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ రఫీ తదితరులు


నాయుడుపేటటౌన్: పట్టణంలోని పాగొట్టం కాలనీలో 20 ఏళ్ల కిందట ఇళ్లు నిర్మించుకున్న పేదలకు విద్యుత్ మీటర్లు మంజూరులో ట్రాన్స్‌కో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం విద్యుత్ కార్యాలయం వద్ద పాగొట్టం కాలనీకి చెందిన బాధితులతో కలసి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీటర్ల మంజూరులో ట్రాన్స్‌కో అధికారుల నిర్లక్ష్యంపై ఇటీవల విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి విన్నవించామన్నారు. దీనిపై మంత్రి వెంటనే స్పందించి ట్రాన్స్‌కో ఎస్‌ఈతో మాట్లాడి పేదలకు వెంటనే విద్యుత్ మీటర్లు మంజూరు చేయాలని ఆదేశించారన్నారు. దీంతో పాగొట్టం కాలనీకి చెందిన 9 మందికి విద్యుత్ మీటర్ల మంజూరు చేశారని, వాటిని మళ్లీ తొలగిస్తామని ట్రాన్స్‌కో వారు చెబుతున్నారన్నారు. వెంటనే మీటర్లు మంజూరు చేయాలని, లేకపోతే కార్యాలయం ఎదుట నిరహార దీక్ష చేపడతామని హెచ్చరించారు. వక్ఫ్‌బోర్డు జిల్లా డైరెక్టర్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు. ఈ విషయమై ట్రాన్స్‌కో ఏఈ వెంకటస్వామి మాట్లాడుతూ పాగొట్టం కాలనీలో విద్యుత్ మీటర్లు మంజూరు విషయమై తహసీల్దార్ ఒకసారి ఇవ్వమని, మరోసారి మీటర్లు మంజూరు చేయవద్దంటూ లిఖిత పూర్వకంగా ఇచ్చారని తెలిపారు. ఈ సమస్యను జిల్లా కలెక్టర్‌కు నివేదించామని, ఆయన సూచనల మేరకు చర్యలు చేపడతామన్నారు.

మూఢ నమ్మకాలు విడనాడాలి

చిల్లకూరు: ప్రజలు మూఢ నమ్మకాలను విడనాడాలని, ఇందుకు విద్యార్థులు తమ తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సైన్స్ ఉపాధ్యాయులు సూచించారు. చింతవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం సైన్స్ వారోత్సవాల సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా మ్యాజిక్‌షో ప్రదర్శించారు. హెచ్‌ఎం శివసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఈ నెల 28న సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాలలోని విద్యార్థులకు సైన్సుపై పిల్లలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.

అగ్గి తెగులు నివారణకు చర్యలు

రాపూరు: వరి పంటకు అగ్గితెగులు సోకి ఉంటే వెంటనే నివారించుకోవాలని ఏఓ సోమసుందరం తెలిపారు. రాపూరు మండలంలోని పలు గ్రామాల్లో రైతులు సాగు చేసిన వరి పంటను ఆయన సోమవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో 1,300 ఎకరాల్లో తెలంగాణ మసూరి రకం వరి సాగు చేశారని, ఆ పంటకు యూరియా ఎక్కువగా వాడడంతో అగ్గి తెగులు సోకుతుందన్నారు. వరిలో అగ్గి తెగులు నివారణకు ఎకరానికి ట్రైసైక్లోజోల్ 100 గ్రాములు పిచికారి చేయాలన్నారు. ఆయన వెంట తేజేశ్వర్‌రెడ్డి ఉన్నారు.



ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

దక్కిలి (బాలాయపల్లె): వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో సోమవారం జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా స్పెషల్ సీఎస్ రాజశేఖర్, సెర్ప్ సీఈఓ ఇంతియాజ్ ప్రకృతి వ్యవసాయంపై మండల సమాఖ్య సిబ్బంది, ఓబీలకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ సేంద్రియ వ్యసాయంపై దృష్టి సారించాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారిస్తే ప్రకృతి విపత్తులు తగ్గి, ఆరోగ్యకరమైన వాతావరణం అందుతుందన్నారు. సేంద్రియ వ్యవసాయంతో మంచి లాభాలు పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక బాధ్యతగా మరుగుదొడ్ల నిర్మాణం

చిల్లకూరు: పరిశ్రమ యాజమాన్యం సామాజిక బాధ్యతగా విద్యార్థులకు మరుగుదొడ్లు నిర్మించిందని పరిశ్రమ ప్రతినిధి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని తమ్మినపట్నం పంచాయతీలోని జిందాల్ పవర్ ప్లాంట్ (సింహపురి యూనిట్) యాజమాన్యం చింతవరంలోని రేస్ పాఠశాలలో విద్యార్థులకు మరుగదొడ్లను నూతనంగా నిర్మించి అందించారు. వీటిని ప్లాంట్ హెడ్ శ్రీనివాసరావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. పరిశ్రమ ప్రతినిధులు ఎం సరోజ్‌పాడి, జోబిన్‌మాథ్యూ, జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శివసుబ్రహ్మణ్యం, బాల చెన్నయ్య, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.